# అమాయకం

అరుణ. మోహన్.

కొన్నాళ్ళుగా ఎవరినోట విన్నా వీళ్ళిద్దరే. మోహన్ మా ఆఫీస్‌లో సీనియర్ యింజినీర్. అరుణ ఎమ్. డి. గారి పర్సనల్ సెక్రటరీ.

ప్రేమ జనించడానికి మొదటి చూపు ఒక్కటీ చాలు అన్న విషయాన్ని వాళ్ళిద్దరూ మరోసారి నిరూపించారు.

ఆ అమ్మాయి మా ఆఫీసులో చేరిన నెల రోజులలోనే వాళ్ళమధ్య ప్రేమ చిగురులేసింది. ఆ విషయం రెండో నిమిషంలో ఆఫీసంతా పాకిపోయింది.

ఇక అప్పటినుంచీ ఆడవాళ్ళు, మగవాళ్ళు అన్న భేదం లేకుండా ఎవరిని కదిలించినా వీళ్ళని గురించిన వార్తాప్రసారం ధారాళంగా సాగుతోంది.

ప్రొద్దున్నే తొమ్మిది గంటలకి ఆఫీసులో అడుగుపెట్టగానే ఒక పదినిమిషాలు సంక్షిప్తంగా చర్చలు జరుగుతాయి. ముందురోజు సాయంత్రం వాళ్ళిద్దరినీ ఎవరయినా ఎక్కడయినా చూసుంటే ఆ విషయం. . ఒకవేళ చూసి వుండకపోయినా వాళ్ళు ఎక్కడికి వెళ్ళి వుండవచ్చో వూహించేందుకు ఆధారాలు ఏమయినా దొరికి వుంటే ఆ విషయం. . యిలాంటివి స్థూలంగా ఆ సమయంలో చర్చించబడతాయి.

ఆ తర్వాత పదిన్నరకి టీ వస్తుంది. మామూలుగా అయితే టీకి కేటాయించవలసిన సమయం పదినిమిషాలే.

కానీ కళ్ళముందు తిరుగుతున్న ప్రేమజంటని గురించిన కబుర్లు ఆ పదినిమిషాల వ్యవధినీ అరనిమిషంలా మార్చేస్తాయి.

ఆరోజు అరుణ ఏం చీర కట్టుకొచ్చింది! బ్లౌజ్ ఏ డిజయిన్‌లో కుట్టబడింది! ఆ చీర ఖరీదు ఎంత వుండవచ్చు! అది ఆమే కొనుక్కుని వుంటుందా! లేక మోహన్ కొనిపెట్టి వుంటాడా! . . ఇలాంటివి టీటైంలో చర్చించే విషయాలు.

టీ త్రాగి వచ్చాక యిక మనసుని బలవంతంగా పని మీదకి మరలించేలోపూ లంచ్ టైం అవుతుంది.

ఇక అప్పుడు ఆ అరగంట. . అరగంట ఏమిటిలెండి! దాదాపు గంట. . పూర్తిగా వీళ్ళిద్దరికే అంకితం చేయబడుతుంది.

మగవాళ్ళు బయటికి వెళ్తారు కాబట్టి అంత సవివరమయిన చర్చలకి అవకాశముండదేమో కానీ ఆడవాళ్ళు అందరూ ఆఫీసులోనే భోజనం చేస్తారు.
ఒంటిగంట అవగానే టిఫిన్ బాక్సుల మూతలు కలిసి కట్టుగా తెరుస్తారు. అయితే అన్నం కన్నా ఆత్రంగా అరుణ వలపు వార్తలు ఆవిర్లు కక్కుతూ వెలువడతాయి.
ఈమొత్తం చర్చలకి నాయకురాలు భానుమతి. చాలా తెలివిగా సంభాషణ మొదలుపెడుతుంది ఆ అమ్మాయి. తనంతట తాను అభాండాలు వేసినట్లు, అల్లరి చేసినట్లూ కనిపించదు. అవతలివాళ్ళ చేత ఆ పనులు చేయించి ఆనందిస్తుంటుంది.
ఉష . . కళ్యాణి. . లలిత. . మాధవి. . అందరూ మాట్లాడతారు కానీ నాకు అనిపిస్తుంటుంది. . భానుమతి లేకపోతే వాళ్ళు ఒకటి రెండు రోజుల్లో ఈ టాపిక్ నుంచి డైవర్ట్ అవుతారేమో అని.
కానీ అల్లరికయినా ఆశయాలకయినా ఎపుడూ ఒక నాయకత్వం అవసరమవుతుంది కదా!
నాకు అరుణ మీద ప్రత్యేకమయిన ప్రేమ ఏమీ లేదు. ఆ మాటకొస్తే ఆ అమ్మాయితో కన్నా వీళ్ళందరితో వున్న పరిచయమే ఎక్కువ. కానీ నాకు. . "ఈరోజు ఈఅమ్మాయిని అంటే రేపు మనకేమవుతుందో!" లాంటి ఆలోచనలు ఎక్కువ.
ఎవరికయినా అన్యాయం చేస్తే అది తప్పకుండా మనకు త్రిప్పికొడుతుంది అన్న భయం!
అదిగో ఆ పాపభీతి వలనే నేను వాళ్ళ చర్చల్లో ఎక్కువగా పాలు పంచుకోను.
అన్నీ ఒక చెవితో వింటూ వుంటానంతే. లేదంటే ఒకప్రక్కన కూర్చుని "వీళ్ళెందుకిలా వున్నారు! వాళ్ళెందుకలా అన్నారు!" అనుకుంటూ కారణాలు అన్వేషిస్తుంటాను.
"నిన్న వాళ్ళిద్దరూ సంగీత్‌లో సినిమాకి వెళ్ళాలనుకున్నట్లున్నారే!" భానుమతి గొంతు మెల్లగా వినబడింది.
"నీకెలా తెలుసు!" ఉష అడిగింది.
"నిన్న మేము బస్ స్టాప్‌కి వెళ్ళామా!" మాట పూర్తి చేయకముందే ఫక్కున నవ్వింది భానుమతి. ముందురోజు జరిగిన సంఘటనని తల్చుకోగానే మరోసారి నవ్వొచ్చింది ఆ అమ్మాయికి. "బలే మజా వచ్చిందిలే." అంది.
అందరి మొహాల్లో క్యూరియాసిటీ వెల్లువలా కనబడింది.
మరోప్రక్క మాధవి కూడా నవ్వు ఆపుకోలేక అవస్థపడుతోంది.

"ఏమైంది!" ఉష, లలిత, కళ్యాణి ముక్తకంఠంతో అడగగానే మిగిలిన యిద్దరూ మొహాలు చూసుకుని నవ్వుకున్నారు.

"నిన్న మీరు ముందు వెళ్ళిపోయారు కదా! ఆతర్వాత నేను, మాధవి బస్‌స్టాప్‌కి వెళ్ళాం. ఇంతలో వాళ్ళిద్దరూ కూడా వచ్చారు. పాపం! చాలాసేపు మాకు కనబడకూడదని మెల్లమెల్లగా నడిచారు కానీ చివరికి మాతో కలవక తప్పలేదు. మేము ఎక్కిన బస్ ఎక్కకూడదని చాలాసేపు ఆగారు. మేమేం చేశామో తెలుసా!" నవ్వుతో గొంతు అస్పష్టమవుతుండగా చెప్పింది భానుమతి. "బస్ రాగానే యిదిగో యిలా ఎక్కబోయినట్లు యాక్షన్ చేయడం.. చివరిదాకా నిలుచుని, బస్ కదిలే టైంకి "వద్దులే రష్‌గా వుంది" అని ఆగిపోవడం.. ఇలా ఫైవ్ సిక్స్ బసెస్ తప్పించాం. పాపం! అరుణకేమో టెన్షన్ సినిమా టైం అయిపోతోందని.. మోహన్ ఏమో మేం వెళ్ళాక వెళ్ళాలని." నవ్వు ఎక్కువయిపోయి ఆమె చెప్పలేక అవస్థపడుతుంటే, అక్కడ్నుంచి మాధవి కంటిన్యూ చేసింది.

" చివరికేమయిందో తెలుసా! మేము బిస్కెట్స్ కొందామని షాపులోకి వెళ్ళాం. అపుడే ఒక మెట్రోబస్ వచ్చింది. వాళ్ళిద్దరూ గబగబా  అందులోకి ఎక్కేశారు. మేమేం చేశామో తెల్సా! షాపులోనుంచి పరుగెత్తుకుంటూ వచ్చి, అదే బస్ వెనుకనుంచి ఎక్కేశాం. వాళ్ళ వెనకాలే కూర్చున్నాం. కానీ వాళ్ళు మమ్మల్ని చూడలా. బాగా కబుర్లు చెప్పుకున్నారు. తీరా దిగేటపుడు చూశారు మమ్మల్ని. ఇంక చూడూ. మొహంలో నెత్తురుచుక్క లేదు. ఇద్దరిమొహాలూ తెల్లగా పాలిపోయాయి."

ఒక అయిదునిమిషాలసేపు ఆపసోపాలమధ్య వాళ్ళ నవ్వులు కొనసాగాయి.

నాలో వున్న లోపమేమిటో కానీ .. నాకు నిజంగా నవ్వు రాలేదు. వాళ్ళ మాటల కొసలు పట్టుకుని ఆ దృశ్యాన్ని యదాతథంగా వూహించుకున్నా కూడా నవ్వు రాలేదు. పైపెచ్చు.. "అరుణా వాళ్ళు నిజంగానే వీళ్ళని చూసి కంగారు పడుంటారా! వాళ్ళ మొహాలు నిజంగానే పాలిపోయి వుంటాయా! అసలు వాళ్ళు వీళ్ళని పట్టించుకున్నారో లేదో!" .. ఇలాంటి సందేహాలన్నీ పుట్టుకొచ్చాయి.

ఎందుకంటే అలా ఒకళ్ళకి భయపడుతున్నట్లు.. ఒకళ్ళు చూడకూడదన్నట్లు వాళ్ళిద్దరూ ప్రవర్తించడం లేదు. మొదట్నుంచీ కూడా వాళ్ళ ప్రేమని రహస్యంగా వుంచాలన్న ఆలోచనే వాళ్ళకి వున్నట్లు లేదు. అసలు అలా రహస్యంగా, ఎవరికీ తెలీకుండా ప్రేమించుకుంటే గొడవే లేకపోవునేమో!

ప్రొద్దునా, సాయంత్రమూ యిద్దరూ కలిసే ఆఫీసుకి వస్తున్నారు.
కలిసే తిరిగి వెళ్తున్నారు. అతను పంజగుట్ట నుంచి రావాలి. ఆమె మలక్‌పేట నుంచి రావాలి. మరి యిద్దరూ అంత ప్రొద్దున్నే ఎక్కడ కలుసుకుంటున్నారో ఆ భగవంతుడికే తెలియాలి.
నా కళ్ళకి కూడా వాళ్ళిద్దరూ అలా జంటగా ఒకటి రెండు సార్లు కనబడక పోలేదు.
అపుడు అరుణ చాలా హాయిగా హలో అంటూ నవ్వేసింది కానీ బెదురుబెదురుగా చూడలేదు.
మరి వీళ్ళ మాటలు!!
నేను ఆలోచిస్తూండగానే పద్మావతి వచ్చింది. తనది ప్రక్క సెక్షన్. భోజనం కాగానే యిక్కడికి వచ్చి కాసేపు కబుర్లు చెప్పి వెళ్తుంది.
"హాయ్" భానుమతి బృందం ఆమెని సాదరంగా ఆహ్వానించారు. ముందురోజు సంఘటన మొత్తం పద్మావతి కోసం మరోసారి చెప్పబడింది. ఆతర్వాత మళ్ళీ అందరూ మరో అయిదునిమిషాలు మనసారా నవ్వుకున్నారు.
అలా విరగబడి నవ్వుతూన్న వాళ్ళందరినీ చూస్తే నాకొక్కక్షణం భయం వేసింది.
"మోహన్ పెళ్ళి చేసుకుంటే పర్లేదు కాని లేకపోతే అరుణ భవిష్యత్తేమిటి !" అన్న ఆలోచనతో దిగులేసింది.
మళ్ళీ నాకు నేనే సర్దిచెప్పుకున్నాను. "ఏమవుతుంది! ఏమీకాదు. ఇంత పెద్ద ప్రపంచంలో ఈ ఆఫీసూ, ఈ మనుషులూ ఎంతమందనీ! వీళ్ళు సతాయిస్తే యింకో చోట వుద్యోగం చేసుకుంటుంది. అంతేకదా!" అనుకున్నాను.
అయినా ఆ పిల్లకి లేని బాధ నాకెందుకు లేద్దూ! అని ధైర్యం తెచ్చుకున్నాను.
కానీ మనసులో నాకు కొద్దిగా టెన్షన్‌గానే వుంది. ఎందుకంటే మోహన్ చాలామంచి పెళ్ళికొడుకు. మార్కెట్లో అతనికి కనీసం పాతిక లక్షల రేటుంది. అరుణావాళ్ళ కుటుంబం అంత కట్నాన్ని వూహించడం కూడా కష్టమే. పైగా కులాలు వేరు.
ఆ అబ్బాయికేం! మగపిల్లాడు. హాయిగా వుంటాడు. అమ్మాయి ఏమవుతుందో! అనిపించేది.
మోహన్ పెళ్ళయిపోయినట్లూ.. అరుణ విషం త్రాగేసినట్లూ కలలు కూడా వచ్చాయి. ఒకవేళ ఆత్మహత్య లాంటి పనులు చేయకపోయినా.. ముందు అసలది పెద్ద దెబ్బే కదా అనిపించేది.

ప్రేమ ప్రేమ అంటూ తిరిగిన మనిషి వేరే పెళ్ళి చేసుకుంటే తేరుకోవడానికి ఎన్ని రోజులు పడుతుందో! ఆ టైం అంతా వేస్ట్ అయిపోయినట్లే కదా! జీవితంలో చాలా విలువైన సమయాన్ని, యవ్వనాన్ని ప్రేమ పేరుతో వేస్ట్ చేసుకోవడం తెలివితక్కువ తనమే కదా! అనిపించేది.

అలా ఆలోచించినపుడు భానుమతి బృందం అరుణని వెక్కిరించడం తప్పుకాదేమో అని కూడా అనిపించేది. అవును మరి! భానుమతికి కూడా యింకా పెళ్ళి కాలేదు. ఉషకీ.. లలితకీ కూడా. కానీ వాళ్ళందరూ యిలాంటి పిచ్చిపనులు చేయడం లేదు కదా! తెలివిగా, జాగ్రత్తగా ఉద్యోగం చేసుకు వెళ్తున్నారు కదా! అలాంటపుడు వాళ్ళకి ఈ అమ్మాయి తెలివితక్కువతనం వేళాకోళంగానే వుండొచ్చు మరి! తప్పేముంది! అనిపించేది.

అయితే యిలాంటి ఆలోచనల నుంచి నాకు చాలా త్వరగానే విముక్తి లభించింది. ఆరోజు నేను ఆఫీసుకి వచ్చేసరికి తాజా వార్త సిద్ధంగా వుంది.

"అరుణా, మోహన్ పెళ్ళి చేసుకుంటున్నారు.."

రిసెప్షనిస్ట్ దగ్గర ఆ మాట వినగానే చాలా ఆనందంగా అనిపించింది. "ఆహా!" అన్నాను సంతృప్తిగా. "ఎప్పుడూ!"

"నెక్స్ట్ ఫ్రైడే."

సమాధానం విని నా సీట్లోకి వచ్చాను. లంచ్ టైంలో అరుణ శుభలేఖలు తీసుకుని వచ్చింది. వరుసగా ఒక్కొక్కరికీ పంచుతూ వస్తుంటే నేను ఊపిరి బిగపట్టి చూశాను, వాళ్ళ మొహాల్లో ఎక్స్ప్రెషన్ కోసం!

ఆశ్చర్యం! ఎవరూ బయట పడలేదు. అందరూ నవ్వుతూ "కంగ్రాట్యులేషన్స్" అన్నారు.

నా దగ్గరికి రాగానే నేను కూడా చిరునవ్వుతో అదేమాట చెప్పాను. "కార్డ్ చాలా బాగుంది." అన్నాను. అందంగా నవ్వింది అరుణ.

"కూర్చో" అన్నాను.

"ఇంకా చాలా మందికి యివ్వాలి." అంటూనే కూర్చుంది.

అందరూ లంచ్ బాక్సులు పట్టుకుని చివర్లో వున్న టేబుల్ దగ్గరికి వెళ్ళిపోయారు. అక్కడ మేమిద్దరమే మిగిలాం.

మా మాటలు ఎవరికీ వినపడవని నిర్ధారించుకున్నాక.. "కట్నం వుందా!" అని అడిగాను చిరునవ్వుతో.

"లేదు. కట్నం ప్రసక్తి వస్తే మేము తూగగలిగే వాళ్ళం కాదుగా!" హాయిగా నవ్వుతూ చెప్పింది.

"అదే. అందుకే అడుగుతున్నాను." నోరుజారి అనేశాను. ఆ తర్వాత ఆమె ఏమనుకుందో అని కంగారుగా తన మొహంలోకి చూశాను.

తనేమీ నొచ్చుకున్నట్లు లేదు. చాలా స్వచ్ఛమైన స్వరంతో చెప్పింది. "లేదండీ! మోహన్ మొదటినుంచీ ఆమాట ఖచ్చితంగానే చెప్పాడు. మామూలుగా మావాళ్ళు చూసిన అమ్మాయిని చేసుకుంటే కట్నం లాంటి విషయాలు నేను పట్టించుకోకుండా వాళ్ళకే వదిలేసేవాడినేమో! కానీ యిపుడు నువ్వు నాకు నచ్చావు. డబ్బు కారణంగా నిన్ను వదులుకోవడం నాకు యిష్టంలేదు. నీకు యిష్టమై ఒప్పుకుంటే చాలు, నాకు పైసా కూడా కట్నం వద్దు అన్నాడు." నవ్వుతూ చెప్పింది అరుణ. "సరే. ఈ మాటలు చూసి కాదనుకోండి. ఈమాత్రం డైలాగ్స్ పెళ్లికి ముందు ఎవరైనా చెప్తారు." అంది మళ్ళీ తనే.

"ఎన్ని మాటలు చెప్పినా వాటికి నిలబడ్డాడు కాబట్టి సరిపోయింది కానీ లేకపోతే కష్టమే కదా! తీరా పెళ్ళి టైంకి టి.వి. కావాలీ.. స్కూటర్ కావాలి అని లిస్ట్ చదివితే ఏం చేస్తాం!" యధాలాపంగా అనేశాను.

అరుణ నాకళ్ళలోకి సూటిగా చూస్తూ నవ్వింది.

ఒక్కసారిగా నాకాళ్ళు వణికాయి. నా గుంజాటన అంతా దేనికోసమో .. యిన్నాళ్ళూ నా ఆలోచనలన్నీ ఎలా సాగాయో నేను అన్న మాటల్లో బయటపడిందనీ.. అది ఆమెకి అర్థమయిందనీ తెలియగానే నా నుదుటిమీద చెమట పట్టింది.

కానీ అరుణ మాత్రం అదే చిరునవ్వుతో అడిగింది. "ఆ రిస్క్ పెద్దవాళ్ళు కుదిర్చిన పెళ్ళిలోనూ వుంటుందిగా!" అని.

ఒక్కసారిగా ఆమె గొంతు గంభీరమయింది. "మీ సందేహం ఏమిటో నాకు తెలుసు. నిజమే. కాణీ కట్నం లేకుండా పెళ్ళి చేసుకుంటానన్నంత మాత్రాన అతనితో కలిసి నేను సినిమాలూ షికార్లూ తిరగనక్కరలేదు. చివరిక్షణంలో మోసం చేస్తే! అన్న భయం లేకుండా అతను ఎక్కడికి రమ్మంటే అక్కడికి వెళ్ళాల్సిన అవసరం లేదు.

కానీ నేను ఒక్కటే అనుకున్నాను. అన్ని అర్హతలు వున్న వ్యక్తి.. మామూలుగా అయితే నా స్థాయికి అందని వ్యక్తి.. నన్ను పెళ్ళి చేసుకుంటానంటూ ముందుకు వచ్చాడు. అలాంటపుడు, అంత అదృష్టం ఎదురువచ్చినపుడు కాస్త రిస్క్ తీసుకోవడంలో తప్పేముంది! అనుకున్నాను. అతను పిల్చినపుడు.. "నేను రాను" అనమ్చ. కానీ నాకు కూడా అతని గురించి తెలియాలి కదా! నాకు పూర్తిగా భిన్నమయిన ప్రపంచంలో నుంచి వచ్చిన వ్యక్తి.. అతని అలవాట్లూ, పద్ధతులూ కొంతవరకైనా తెలుసుకునే ప్రయత్నం నేనూ చేయాలి కదా! అదైనా ఒక బాధ్యతాయుతమయిన ఉద్యోగం చేస్తున్న వ్యక్తి.. లేనిపోని చనువు తీసుకునే సాహసం చేయడు అన్న నమ్మకం ఉండడం వల్లనే" తడుముకోకుండా చెప్పింది అరుణ ఆమాటలు.

నాకు ఒక్కసారిగా అర్థమయింది. అరుణ నేను అనుకున్నట్లూ తెలివితక్కువపిల్ల కాదు. ఆ అమ్మాయి అన్న ఆఖరి వాక్యం దగ్గర నా ఆలోచనలు ఆగిపోయాయి. అతను మంచివాడు అన్న నమ్మకంతో వెళ్ళాను అనడం లేదు ఆ అమ్మాయి. అలా అని వుంటే .. సరేలే ప్రేమలో పడ్డప్పుడు అందరూ మంచివాళ్ళలాగే కనపడతారు, అనుకునేదాన్ని నేను.

నా ఆలోచనలు తెగ్గొడుతూ ఆమె మళ్ళీ చెప్పింది. "అయితే ఈక్షణం వరకూ నాకు అతనంటే ప్రేమ లేదు."

నేను ఉలిక్కిపడి ఆమె కళ్ళలోకి చూశాను.

"అవును. ఆడపిల్లకి అసలు రిస్క్ అంటూ ఏమైనా ఉంటే అదే కదా! ఒకసారి ఒకమనిషిని ప్రేమించాకా.. భర్తగా వూహించుకున్నాకా, జన్మలో మరోమనిషికి దగ్గర కాలేదు. అందుకే.. ఆ ఒక్క విషయంలో మాత్రం నేను జాగ్రత్తపడ్డాను. అతను ప్రేమ ప్రేమ అంటూ పరితపిస్తున్నాడు గానీ నేను మాత్రం మంగళసూత్రం మెడలో పడే వరకూ నామనసు గుమ్మంలోకి అతన్ని అడుగుకూడా పెట్టనివ్వను."

నొసలు చిట్లించి ఆమె చెప్పిన తీరుకి నాకు నవ్వొచ్చింది.

ఈ పిల్లని గురించా నేనిన్నాళ్ళూ దిగులు పడ్డాను! అనుకుంటే నామీద నాకే జాలేసింది.

"కానీ అరుణా! అదంతా కరక్టే కానీ.. లోకులు వూరికే వుండరు కదా! ఈలోపు ఎన్నో కథలు అల్లుతారు." అన్నాను.

"అవును. అల్లుతారు. గంటల తరబడీ, రోజుల తరబడీ మాగురించి చెప్పుకున్నారు. కానీ అది నిజంగా నాకు సమస్యేనా చెప్పండి!" అంది.

"సమస్యే కదా మరి!"

"ఎలా!"

నాకేం చెప్పాలో అర్థం కాలేదు. "ఎలా అంటే. ." తడబాటుగా ఆగిపోయాను.

"చూడండి. ఈ మొత్తం వ్యవహారానికి రెండే ముగింపులున్నాయి. ఒకటి, మోహన్ నన్ను పెళ్ళి చేసుకోవడం. రెండోది, మరో పెళ్ళి చేసుకుని నన్ను మోసం చేయడం. నా వైపు నుంచి ఆలోచిస్తే మొదటిది నాకు లాభం. రెండోదాని వల్ల నామనసు గాయపడితే నష్టం. ఒకవేళ అలా గాయపడకుండా ముందునుంచీ నేను ప్రికాషన్స్ తీసుకోగలిగితే. . రెండోదానివల్ల కూడా నో లాభం. నో నష్టం. అదే. వాళ్ళవైపు నుంచి ఆలోచిస్తే. . ఇన్ని రోజులూ. . ఇన్ని గంటలూ మాగురించి చెప్పుకున్నారు కదా! మా పెళ్ళి అయినా కాకపోయినా వాళ్ళకి వచ్చే లాభం ఏమిటి! సాధించే ప్రయోజనం ఏమిటి!"

అరుణ అడుగుతుంటే నేను నోరుతెరుచుకుని చూస్తూండిపోయాను. తను మాత్రం అదే వెన్నెల నవ్వుతో లేచి నిలబడి "ఉంటానండీ! పెళ్ళికి తప్పకుండా వస్తారుగా!" అంటూ వెళ్ళిపోయింది.

అందరమూ వెళ్ళాం పెళ్ళికి.

నెలరోజుల సెలవు తర్వాత. . అరుణ జాబ్‌కి రిజైన్ చేసేందుకు ఆఫీసుకి వచ్చింది. ఖరీదయిన చీరలో కళకళలాడుతున్న ఆమె చుట్టూ చేరి "ఎందుకు!" అన్నారు అందరూ.

"ఏమో! కష్టమేమో అనిపించింది. డబ్బుకేమీ యిబ్బంది లేదు కదా, పోనీ మానేస్తావా అన్నారాయన." అరుణ సిగ్గులొలికిస్తూ చెప్పింది.

ఒక్క నిమిషం పాటు సూది పడితే వినబడేంత నిశ్శబ్దం ఆవరించింది అక్కడ.

ఆ తర్వాత అందరూ ఆరాధన నిండిన కళ్ళతో చూస్తూ నిల్చుంటే. . అందరిలోకీ మరీ అమాయకంగా వుండే పద్మావతి మాత్రం "నీకేమ్మా! సీనియర్ యింజనీర్ గారి భార్యవి." అన్న వాక్యాన్ని పైకే అనేసింది.

*****